క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఆగిరిపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యులు కృషి చేయాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రత్యేక అధికారి నరేంద్ర కృష్ణ అన్నారు. ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం వరల్డ్ హెల్త్ టీం బృందం పరిశీలించింది. అనంతరం కొత్త ఈదర, సీతారాంపురం గ్రామాల్లో అసంక్రమిత వ్యాధులపై చేస్తున్న సర్వేను వారు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం సభ్యులు డాక్టర్ రేణు గార్గ్, డాక్టర్ సయ్యద్ ఇమ్రాన్, డాక్టర్ ఆసిఫ్ జిలాని, ఈదర పీహెచ్‌సీ వైద్యురాలు సునందకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులు చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండాలి

మైలవరం: విద్యార్థులు చట్ట వ్యతిరేకమైన పనులకు దూరంగా ఉండి తమ కెరీర్‌పై దృష్టి సారించాలని మైలవరం ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లైంగిక వేధింపులు–నివారణ అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి అధ్యక్షత వహించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.సుభాషిణి, వైస్ ప్రిన్సిపాల్ పి.రంగారావు, డాక్టర్ జె.రాముడు, శ్రీమతి ఉమాలక్ష్మి ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గాల ప్రమాణస్వీకారం

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్, సమత, లెజెండ్స్ క్లబ్‌ల ప్రమాణస్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. స్థానిక ఫ్యాక్టరీ సెంటర్లోని కనకం రెసిడెన్సీలో డిస్ట్రిక్ట్ లయన్స్ పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ నివృతరావు, మూల్పూరు ఉపేంద్ర ఆధ్వర్యంలో నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పసుమర్తి వెంకటేశ్వరరావు, చలమాల శంకరరావు, సమత క్లబ్ అధ్యక్ష , కార్యదర్శులుగా కంచర్ల శశికళ, కొమ్మినేని సహజ, లెజెండ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా దూపకుంట్ల జ్వాలా నరసింహారావు, యరదేశి రామారావు ప్రమాణం చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కంచర్ల ముత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేద కుటుంబాలకు కుట్టుమిషన్లు, దుప్పట్లు పంపిణీ చేశారు.

నూతన భవనంలో వైద్యసేవలు



నూజివీడు: పట్టణంలోని నూతన భవనంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అన్ని ఔట్ పేషెంట్ విభాగాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి సోమవారం తెలిపారు. స్థానిక ఆసుపత్రిలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ త్వరలోనే ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు కూడా చర్యలు చేపడుతున్నామన్నారు. ఇప్పటికే బ్లడ్ బ్యాంకు ఏర్పాటుకు సంబంధించి ఉన్నతాధికారుల తనిఖీలు అన్నీ పూర్తయ్యాయన్నారు. కొత్త భవనంలోనే ఎక్స్‌రే యూనిట్, రోగుల వార్డులు ఏర్పాటు చేశామన్నారు. ఆసుపత్రిలో పలు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. చిన్నపిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్, గైనకాలజిస్ట్, జనరల్ సర్జన్, రేడియాలజీ పోస్టులతో పాటు సివిల్ సర్జన్ ఆర్ఎంఓ, డిప్యూటీ సివిల్ సర్జన్ జనరల్ ఖాళీలు ఉన్నాయని వీటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రజలు ఏరియా ఆసుపత్రిలో అందించే వైద్యచికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కబడ్డీలో హీల్ విద్యార్థుల ప్రతిభ



ఆగిరిపల్లి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో హీల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. తోటపల్లి హీల్ పాఠశాలకు చెందిన విద్యార్థులు కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సీబీఎస్సీ క్లస్టర్ సెవెన్ కబడ్డీ పోటీల్లో తృతీయ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయురాలు లతా చౌదరి తెలిపారు. హీల్ సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ హరీష్, పీఈటీ నాగరాజు విద్యార్థులను అభినందించారు.

మతోన్మాద ఫాసిస్టు దాడులను ఎదిరించాలి

చాట్రాయి: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాలనలో జరుగుతున్న మతోన్మాద పాలనను ఎదిరించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ అన్నారు. చిత్తపూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన చారు మజుందార్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా సవరణతో లక్షల సంఖ్యలో బీహారీ ప్రజల ఓట్లు గల్లంతవుతాయని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు దుర్గం పుల్లారావు, చాట్ల బాబూరావు, శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నరకప్రాయంగా నూజివీడు–ఆగిరిపల్లి రహదారి

భారీ గుంతలతో వాహనదారుల ఇబ్బందులు



వట్టిగుడిపాడులో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి



రామన్నగూడెం-వట్టిగుడిపాడు మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

నూజివీడు: కూటమి ప్రభుత్వం గత ఏడాది అధికారంలోకి వచ్చాక ఈ ఏడాది సంక్రాంతి నాటికి రాష్ట్రంలోని రహదారుల్లో ఎక్కడా గుంత అనేది లేకుండా చేస్తామని ఆర్భాటంగా ప్రకటించింది. కాని సంక్రాంతి వెళ్లి ఆరుమాసాలు దాటినా ఇంకా రాష్ట్రంలో పలు ప్రధాన రహదారులు భారీ గుంతలతో ప్రయాణికులకు నరకాన్ని తలపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం నూజివీడు–ఆగిరిపల్లి రహదారి. నూజివీడు నుంచి ఈదులగూడెం మీదుగా ఆగిరిపల్లి వెళ్లే రోడ్డు అడుగడుగునా గుంతలతో అధ్వానంగా తయారైంది. వర్షాలకు ఆ గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులకు ఈ రహదారి కనిపించడం లేదా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ మార్గంలో రామన్నగూడెం, వట్టిగుడిపాడు, పోలసానపల్లి, ఈదులగూడెం, చొప్పరమెట్ల, తాడేపల్లి, కలటూరు, అనంతసాగరం, సగ్గూరు, కొమ్మూరు, కృష్ణవరం గ్రామాలతో పాటు బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన గ్రామస్తులు నూజివీడు వచ్చేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారి అడుగుకో గొయ్యితో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతలలో పడి కార్లు ముందు భాగం గుద్దుకుంటుండటంతో తమ కార్లు పాడైపోతున్నాయని, షెడ్‌కు వెళ్తే వేలకు వేలు ఖర్చవుతున్నాయని కార్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం అయినప్పటికీ రోడ్లు మెరుగుపడకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వట్టిగుడిపాడులో అయితే రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడటంతో వాహనాలు ప్రమాదాలకు సైతం గురవుతున్నాయి. రహదారి పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల పలు గ్రామాల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనులపై నూజివీడు రావాలన్నా, మండల కేంద్రమైన ఆగిరిపల్లి వెళ్లాలన్నా గుంతలమయంగా ఉన్న ఈ రహదారిపైనే రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. చొప్పరమెట్ల, తాడేపల్లి తదితర గ్రామాల ప్రజలైతే నూజివీడు రావాలంటే ఆగిరిపల్లి వెళ్లి నూజివీడుకు మరో మార్గంలో వస్తున్నారు. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతలు పూడ్చండి



నూజివీడు నుంచి వట్టిగుడిపాడు, ఈదులగూడెం మీదుగా ఆగిరిపల్లి వచ్చే ఆర్అండ్‌బీ రహదారి అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలి.

–ఈలప్రోలు వెంకట సుబ్బయ్య, ఈదులగూడెం, ఆగిరిపల్లి మండలం

స్మార్ట్ మీటర్‌లతో పెనుభారం

రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు

మైలవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదేశానుసారం ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించేలా అదాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై అధిక భారాలు మోపుతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పీవీ ఆంజనేయులు విమర్శించారు. కరెంట్ మీటర్లు పెట్టొద్దని ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ విద్యుత్ భారాలు తగ్గిస్తామని అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రూ.15,485 కోట్లు అదనంగా సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపారన్నారు.కార్యక్రమంలో సీపీఎం నాయకులు చాట్ల సుధాకర్, రైతు సంఘం నాయకులు రావుల సుబ్బారావు, వివిధ సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

ఆగిరిపల్లి: ప్రజలపై భారం మోపుతున్న స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాజు డిమాండ్ చేశారు. నెక్కలంగొల్లగూడెంలో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాజు మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీల అదనపు భారంతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారన్నారు.

జగనన్న కాలనీలోని అసౌకర్యాలను తొలగించండి

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న జగనన్న కాలనీ నివాసితులు

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ శివారు అట్టల ఫ్యాక్టరీ రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని సీపీఐ రాష్ట్ర సమితి నాయకులు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు కాలనీవాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కనీస వసతులు లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోడ్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వారు పడుతున్న బాధలు వర్ణనాతీతమన్నారు. ఖాళీ స్థలాల్లో చెట్లు పెరిగి విషసర్పాలు గృహాల్లోకి వస్తున్నాయన్నారు. వీధిలైట్లు కూడా లేకపోవడంతో కటిక చీకటిలోనే కాలనీవాసులు రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. కాలనీకి సమీపంలోనే బ్రాందీ షాపు నిర్వహణ వల్ల మందుబాబులను చూసి మహిళలు, యువతులు తీవ్రమైన భయాందోళనకు లోనవుతున్నారన్నారు. మందుబాబులు కాలనీలోకి వచ్చి ఖాళీ స్థలాల్లో, నిర్మాణంలో ఉన్న గృహాల్లో కూర్చుని మందు తాగుతున్నారని, దీంతో మహిళలు, బాలికలు రాకపోకలు సాగించాలంటే భయాందోళనకు గురవుతున్నారన్నారు. తక్షణమే మద్యం దుకాణాన్ని అక్కడ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నాయకులు పంగిడయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలి

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించకుండా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దిష్ట కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. మండల స్థాయి అధికారులు పరిష్కరించాల్సిన సమస్యలు డివిజన్ స్థాయికి రావడం వల్ల సమయం, డబ్బు వృథా అవుతుందని, మండల స్థాయి అధికారులు తమ స్థాయిలోనే వాటిని పరిష్కరించాలన్నారు. ఒకవేళ సమస్యను పరిష్కరించడానికి వీలు లేకపోతే అందుకు గల కారణాన్ని అర్జీదారుడికి తెలియజేయాలన్నారు. ప్రజల వద్ద నుంచి 29 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, ఏడీఏ జి.విద్యాసాగర్ డీఎల్‌పీఓ సుందరి, సీడీపీఓ పిల్లి విజయకుమారి, హెచ్ఓ ఆర్.హేమ, ట్రిపుల్ ఐటీ ఎస్ఈ జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని ఇలా ఉన్నాయి...

- నూజివీడు మండలం మొర్సపూడిలో తనకు 77 సెంట్ల వ్యవసాయ మెరక భూమి ఉందని, దానిని ఇటీవల వెబ్‌ల్యాండ్‌లో చూసుకోగా 69 సెంట్లుగా నమోదయి ఉందని, తనకు న్యాయం చేయాలని బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన కలపాల చంటిబాబు అర్జీని అందజేశారు.
- తన పెద్ద కుమారుడికి సంబంధించి తల్లికి వందనం నగదు వేరొకరి ఖాతాలో జమ అయిందని, తిరిగి ఇప్పించాలని కోరుతూ పట్టణానికి చెందిన వైకుంఠపు లక్ష్మి అర్జీని అందజేశారు.
- భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, పాత గుర్తింపు కార్డులను రెన్యువల్ చేయడంతో పాటు కొత్త గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని కోరుతూ నూజివీడు మండల బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వెంకట్రావు, వాకా రామ్మోహన్‌రావు అర్జీని అందజేశారు.

రూ.42.80 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



పైడూరుపాడులో సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

పైడూరుపాడు(విజయవాడరూరల్): ఉపాధి హామీ పథకం నిధులు రూ.42.80 లక్షలతో పైడూరుపాడు గ్రామంలో నిర్మించిన 6 అంతర్గత సిమెంటు రోడ్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సోమవారం ప్రారంభించారు. అనంతరం డీఎంఎఫ్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించనున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజల సామాజిక అవసరాలు, బహిరంగ ప్రయోజనాల కోసం ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

అనంతరం పైడూరుపాడు గ్రామంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీలో ప్రజలు ఇళ్ల స్థలాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, గ్రామంలో తాగునీటి సమస్య ఉందని విన్నవించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్రా వాసు, పార్టీ నాయకులు బొమ్మసాని సుబ్బారావు, రంగినేని నరేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

జి.కొండూరు: కుంటముక్కల గ్రామ శివారులోని ఇటుకబట్టీలకు సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై జి.కొండూరు పోలీసులు సోమవారం మధ్యాహ్నం సమయంలో మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 15మందిని అదుపులోకి తీసుకోగా 24 బైకులు, రూ.20,500, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు. మరికొంత మంది పందెం రాయుళ్లు పరారైన క్రమంలో వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు బలోపేతం చేయాలి



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

నూజివీడు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును బలోపేతం చేసి పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకున్న భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలని, కార్మికులకు పెన్షన్, గ్రాట్యుటీ మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలకు దిగుతామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పంగిడయ్య, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వాకా రామ్మోహన్‌రావు, దుబ్బిరెడ్డి నాగేంద్రరావు, కొలుసు చంటి, ఎండి బాజీ, ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబెడెడ్ ఐఓటీలో నైపుణ్యం ఉంటే అవకాశాలు మెండు

మైలవరం: ఎంబెడెడ్ ఐఓటీలో నైపుణ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు ఉత్తేజపరమైన కెరీర్ అవకాశాలు మెండుగా ఉన్నాయని బెంగళూరుకు చెందిన ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.మాధవ్ పాండియన్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ, ఎంబెడెడ్ తారాస్ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఎంబెడెడ్ ఐఓటీ, ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అనే అంశంపై అవగాహన సదస్సును గత వారం రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన సదస్సులో ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పి.శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పరిశ్రమల్లో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్లకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి ప్రసంగించారు. డాక్టర్ వై.రఘువంశీ, కె.లక్ష్మీలావణ్య కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలి



మూలపాడులో కౌలు రైతుల సమస్యలపై వీఆర్వోకు వినతిపత్రం అందిస్తున్న జమలయ్య

మూలపాడు(ఇబ్రహీంపట్నం): కౌలు రైతులకు ప్రభుత్వం తక్షణమే గుర్తింపు కార్డులు అందజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మూలపాడు గ్రామ రైతు సేవా కేంద్రంలో కౌలు రైతుల సమస్యలపై వీఆర్వో నరేంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది జూన్ నెలలో గుర్తింపు కార్డులు జారీ చేసేవారని, ఈ ఏడాది జూలై గడిచిపోతున్నా ఇంతవరకు కార్డులు మంజూరు చేయలేదని విమర్శించారు. కార్డుల జారీలో ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు మాట్లాడుతూ కోఆపరేటివ్ సొసైటీల్లో రైతులకు రుణాలు, ఎరువులు సకాలంలో ఇవ్వడం లేదన్నారు. అన్నదాత సుఖీభవతో పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, నిమ్మగడ్డ వాసు, హరికృష్ణ పాల్గొన్నారు.

గోదాదేవికి విశేష పూజలు



తిరువూరు కోదండ రామాలయంలో సారె సమర్పిస్తున్న మహిళలు

తిరువూరు: గోదాదేవి తిరునక్షత్ర సందర్భంగా సోమవారం తిరువూరులోని పలు దేవాలయాల్లో అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకోదండ రామాలయంలో గోదాదేవికి, మూలవరులకు తిరువంజనం అనంతరం భక్తులు సారె సమర్పించారు. రాజుపేట శ్రీవీరాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు, నివేదన, సారె సమర్పణ కార్యక్రమాలు జరిగాయి. పాటిమీద దాసాంజనేయస్వామి ఆలయంలో గోదా సమేత శ్రీ కృష్ణ పరమాత్మ మూలవిరాట్‌లకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. శ్రీవేంకటాచలస్వామి దేవస్థానంలో గోదాదేవికి క్షీరాభిషేకం, దద్ధ్యాభిషేకం, నెయ్యాభిషేకం, తేనె, చక్కెర, నారికేళ, గంధం, పసుపు, కుంకుమతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఊంజలసేవలో భక్తులు పాల్గొన్నారు. ఊటుకూరు కోదండరామాలయంలో అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. విష్ణు సహస్ర నామపారాయణ, తిరుప్పావై పఠించారు.

మైలవరంలో అమ్మవారికి అభిషేకం

మైలవరం: మైలవరంలోని శ్రీద్వారకా తిరుమల దత్తత దేవాలయం శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీగోదాదేవి జన్మనక్షత్రం సందర్భంగా సోమవారం అమ్మవారికి విశేష పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ద్వారకా తిరుమల దేవస్థానాల చైర్మన్ ఎస్వీ సుధాకరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు సూరానేని నివృతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కొండపల్లిలో వైఎస్సార్ సీపీ కమిటీల ఏర్పాటు పూర్తి



కొండపల్లి వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల పూర్తి జాబితా జోగి రమేష్‌కు అందజేస్తున్న శ్రీనివాసరాజు

ఇబ్రహీంపట్నం:కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలో వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల కమిటీలు పూర్తి చేసినట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు తెలిపారు. ఈమేరకు మాజీ మంత్రి, నియోజకవర్గం సమన్వయకర్త జోగి రమేష్‌కు కమిటీల పూర్తి జాబితాను సోమవారం అందజేశారు. జోగి రమేష్ మాట్లాడుతూ పార్టీ ఎదుగుదలకు కార్యకర్తలు ముఖ్యమన్నారు. వివిధ పార్టీ విభాగాల్లో నియమితులైన వారు కార్యకర్తలతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పోరంకి శ్రీనివాసరాజు, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, నియోజకవర్గ ఎస్సీ, బీసీ సెల్ అధ్యక్షులు నల్లమోతు దయాకర్, కుంచం జయరాజు, ఎన్.ప్రకాశ్, బత్తుల కృష్ణ, బత్తుల రాజేష్, ఈశ్వరి, బాలచందర్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

ముసునూరు: కౌలు రైతులకు ఈ ఏడాది గుర్తింపు కార్డులు మంజూరు చేయకపోవడంపై రైతు సంఘం మండల కార్యదర్శి చెంగల వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సత్వరం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక కౌలు రైతులతో కలసి సచివాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. కౌలు కార్డుల జాప్యంతో కౌలు రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయే పరిస్థితి తలెత్తుతోందని, తక్షణం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

ముదినేపల్లి రూరల్: పోల్‌రాజ్ పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దాకరం శివారు నాయుడుచెరువు సమీపంలో పోల్‌రాజ్‌కాలువలో గుర్రపుడెక్క మధ్య పురుషుని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి వీఆర్వో గూడపాటి సంజీవరావుకు సమాచారం అందించారు. ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు గుర్రపుడెక్క తొలగించి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగనన్న కాలనీలో రోడ్లు వేయాలని వినతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జగనన్న కాలనీలో వర్షాలకు జలమయం అయిన రోడ్లు నడిచేందుకు వీలులేకుండా పోయాయని కాలనీ ప్రజలు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడులో పర్యటిస్తున్న ఎమ్మెల్యేను సోమవారం కాలనీవాసులు కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పూర్తిగా నీటిమయంగా మారాయని, విద్యార్థులు, స్థానికులు నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయని వాపోయారు. రోడ్లతో పాటు వీధిలైట్లు, తాగునీటి సదుపాయం, డ్రైనేజీ, వైద్యశాల ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

అంగన్‌వాడీ స్కూల్ ప్రాంగణంలో చెత్త తొలగింపు

మైలవరం: మైలవరం మండలం వెల్వడం గ్రామ దళితవాడలోని అంగన్‌వాడీ స్కూలు ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు చుట్టుపక్కల వారు చెత్తా చెదారం పారవేయడంతో దుర్వాసన వెదజల్లి చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు పిచ్చిమొక్కలు పెరిగి దోమలు విజృంభిస్తూ రాత్రి వేళల్లో నిద్రపోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై స్పందించిన పంచాయతీ ప్రెసిడెంట్ ధర్మరాజు పొక్లెయిన్ ఏర్పాటు చేసి ఆ పరిసరాలను శుభ్రం చేయించారు. దళితవాడలో ఖాళీగా ఉన్న స్థలంలో పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులు చేరి ఆ ప్రాంతం ప్రమాదకరంగా ఉండటంతో అక్కడ కూడా చెట్లు తొలగించి శుభ్రం చేయించారు.

అందుబాటులో ఎరువులు

ఆగిరిపల్లి: మండలంలో యూరియాకు కొరత లేదని, రైతులకు కావలసినంత ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి జె.భవాని తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ మండలంలో సొసైటీలు, డీలర్ల వద్ద కలిపి మొత్తం 74.80 టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆ చెరువులను మత్స్యకారులకు కేటాయించండి

ముసునూరు: గ్రామంలోని చెరువులను చేపల పెంపకానికి కేటాయించాలని మత్స్యకార వృత్తిదారులు ప్రభుత్వాన్ని కోరారు. ముసునూరులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన చేపలు పట్టి, జీవనం సాగిస్తున్న 33 మంది మత్స్యకారులు సోమవారం గ్రామంలోని దేవర చెరువు, నల్లచెరువులను తమకు కేటాయించాలని కోరుతూ సంఘనేత చెంగల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ ప్రశాంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది కొందరు తమను చేపల పెంపకం, అమ్మకాలను చేపట్టనీయకుండా అడ్డుకుని, జీవనోపాధిని దెబ్బతీసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.